నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, ఆదివారం 29 డిసెంబర్ 2024 | NALGONDA

## రేపు సీపీఐ బహిరంగ సభ

● రాష్ట్రవ్యాప్తంగా తరలిరానున్న ఆ పార్టీ శ్రేణులు



నల్లగొండలో వాల్ రైటింగ్స్

రామగిరి, డిసెంబర్ 28 : సీపీఐ ఆవిర్భావించి 100 సంవత్సరాలు అయిన సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలో సోమవారం బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఎన్‌జీ కళాశాల మైదానంలో మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమయ్యే సభకు ఆ పార్టీ శ్రేణులు సమాయత్తమవుతున్నాయి. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ డి.రాజా, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, పశ్య పద్మ హాజరుకానున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం తెలిపారు. సాయుధ పోరాట స్ఫూర్తితో నల్లగొండలో నిర్వహిస్తున్న సభకు ఉమ్మడి జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ శ్రేణులు తరలిరానున్నట్లు చెప్పారు.



నల్లగొండలో టీఎస్ యూటీఎఫ్ మహా ప్రదర్శనలో పాల్గొన్న మహాసభల చైర్మన్, టీచర్స్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు

# ఆందోళన కలిగిస్తున్న క్రైం రేట్



## నల్లగొండ జిల్లాలో పెరిగిన హత్యలు, చోరీలు, మోసాలు

- ఈ ఏడాది **8,695** ఎఫ్ఐఆర్‌లు నమోదు
- గతేడాదితో పోలిస్తే ఎక్కువ
- కలవరపరుస్తున్న కుటుంబ హత్యలు
- 90 శాతం పెరిగిన చీటింగ్ కేసులు
- రోడ్డు ప్రమాదాల్లో 373 మంది దుర్మరణం
- సవాల్‌గా సైబర్ క్రైమ్స్
- భారీగా చోరీకి గురైన ఆస్తులు..
- మహిళలపై నేరాల్లో తగ్గుదల
- అసాంఘిక నేరాలపై ఉక్కుపాదం
- పార్థీ గ్యాంగ్‌కు కళ్లెం వేసిన పోలీసులు

**నల్లగొండ జిల్లాలో ఈ ఏడాది నేరాలు పెరిగాయి. వాటిల్లో తీవ్ర నేరాలైన హత్యలు, దోపిడీలు పెరుగడం ఆందోళన కలిగిస్తున్నది. హత్యల్లోనూ కేవలం కుటుంబ తగాదాలతో చోటుచేసుకున్నవే 33 శాతం ఉన్నాయి. సోషల్ మీడియాను వాడుకుని సైబర్ నేరగాళ్లు కోట్ల రూపాయలు కొల్లగొట్టారు. దొంగతనాలు పెరిగాయి. చోరీ అయిన సొత్తు భారీగా ఉంది. రోడ్డు ప్రమాదాల తీవ్రత అలాగే కొనసాగుతుండగా ఈ ఏడాది 373 మంది మృత్యువాత పడ్డారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 9,840 నమోదయ్యాయి. మోటారు వాహనాల కేసుల్లో మొత్తం రూ.4.87కోట్ల రూపాయల జరిమానలు విధించారు. డయల్ 100కు 51,650 కాల్స్ వచ్చినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్ శనివారం విడుదల చేసిన వార్షిక నేర నివేదిక స్పష్టం చేసింది.**

– నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్28(నమస్తే తెలంగాణ)

2024 సంవత్సరంలో నల్లగొండ జిల్లాలో ఎఫ్ఐఆర్‌ల నమోదు భారీగా పెరిగింది. 2023లో తీవ్ర నేరాలకు సంబంధించి 185 ఎఫ్ఐఆర్‌లు కాగా, ఈ ఏడాది 211కి పెరిగింది. సాధారణ నేరాలు గతేడాదిలో 7,716 కాగా, ప్రస్తుత ఏడాదిలో 8,484 నమోదయ్యాయి. మొత్తంగా చూస్తే 2023లో రిజిస్టర్డ్ కేసుల సంఖ్య 7,901 ఉండగా, ఈ సంవత్సరం 8,695కు చేరాయి. మేజర్ క్రైమ్స్‌ను పరిశీలిస్తే హత్యలు, మోసాలు, చోరీల సంఖ్య పెరిగింది. ఆస్తి కోసం హత్యలు 2023లో జీరో కాగా, 2024లో 5, బందిపోటు దొంగతనాలు గతేడాది ఒక్కటి జరుగ్గా ఈ ఏడాది రెండు చోటుచేసుకున్నాయి. దోపిడీలు 2 నుంచి 10కి పెరిగాయి. హత్యలు గతంలో 32 ఉండగా, ఈ ఏడాది ఇప్పటివరకు 33 హత్యలు జరిగాయి. మూఢనమ్మకాలతో జరిగిన హత్యలు 9 నుంచి 5కి తగ్గాయి. హత్య కేసుల కారణాలను పరిశీలిస్తే కుటుంబ తగదాల కారణంగా జరిగినవి 33 శాతం ఉండడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నది. మొత్తం 33 కేసులు నమోదైతే అందులో 11 హత్యలు కుటుంబ సభ్యుల మధ్య తగాదాలతో జరిగినవే ఉన్నాయి. ఆర్థికపరమైనవి 4, వివాహేతర సంబంధాల నేపథ్యంలో 6, భూతగాదాలతో 4 హత్యలు జరిగాయి.

### భారీగా పెరిగిన మోసాలు..

ఈ ఏడాది చీటింగ్ కేసులు భారీగా పెరిగాయి. 2023లో 362 చీటింగ్ కేసులు నమోదైతే ఈ ఏడాది ఇప్పటివరకు 657 కేసులు నమోదయ్యాయి. ఆర్థిక పరమైన మోసాలే ఇందులో ఎక్కువగా ఉన్నాయి. ఇక లైంగికదాడుల కేసులు 98 నుంచి 100కి పెరిగాయి. హత్యాయత్నం కేసులు 56 నమోదయ్యాయి. మిస్సింగ్ కేసులు తగ్గడం ఊరటనిచ్చే అంశం. గతంలో 522 మిస్సింగ్ కేసులు ఉండగా, ప్రస్తుతం 476 నమోదయ్యాయి.

### పెరిగిన చోరీలు, సొత్తు విలువ

ఈ ఏడాదిలో దొంగతనాలు కూడా భారీగానే జరిగినట్లు పోలీస్ నివేదిక స్పష్టం చేస్తున్నది. 2023లో మొత్తం 523 చోరీ కేసులు నమోదు కాగా ఈ ఏడాది ఇప్పటివరకు 550 కేసులు అయ్యాయి. 2023లో మొత్తం రూ.4.83కోట్ల సొత్తు చోరీకి గురికాగా, ఈ ఏడాది రూ.14.13కోట్ల సొత్తు పోయింది. అందులో రూ.5.06కోట్లను పోలీసులు రికవరీ చేయగలిగారు. గతంతో పోలిస్తే రికవరీ శాతం 28 నుంచి 36శాతానికి పెరిగింది. కేసుల ఛేదన కూడా 41 శాతం నుంచి 56 శాతానికి పెరిగింది. ఈ ఏడాది పోలీసులు తీవ్ర నేరాలు, దోపిడీలకు పాల్పడే పార్థీ గ్యాంగ్ ఆట కట్టించగలిగారు. అంతర్రాష్ట్ర బైక్ దొపిడీ ముఠాను పట్టుకోగలిగారు.

### మహిళల కేసుల్లో మెరుగుదల

మహిళలకు సంబంధించిన కేసుల సంఖ్య తగ్గింది. ఈ ఏడాది మొత్తం 655 కేసులు నమోదు కాగా.. ఇందులో లైంగిక దాడులు 97, కిడ్నాప్‌లు 46, మర్డర్లు 8, వేధింపులు 292, వరకట్న వేధింపుల మరణాలు ఒకటి నమోదయ్యాయి. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఈసారి అసాంఘిక కార్యకలాపాల నివారణకు గట్టి ప్రయత్నం చేసింది. ఇందులో పీడీఎస్ అక్రమ రవాణా కేసులు 217, ఇసుక అక్రమ రవాణా 482, గుట్కా విక్రయాలు 8, గోవుల అక్రమ రవాణా 28, నకిలీ విత్తనాల విక్రయం 2, ఎక్సైజ్ కేసులు 613 కేసులు నమోదయ్యాయి.

### సవాల్‌గా సైబర్ నేరాలు



ఇటీవల పెరుగుతున్న సైబర్ నేరాలు పోలీసులకు సవాల్‌గా మారుతున్నాయి. నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా క్షేత్రస్థాయిలో ఫలితం ఉండడం లేదు. గతేడాదితో పోలిస్తే సైబర్ నేరాల సంఖ్య తగ్గినట్టే కనిపిస్తున్నా కోల్పోయిన సొమ్ము మాత్రం భారీగా పెరిగింది. 2023లో 276 సైబర్ నేరాలు రిజిస్టర్ అయ్యాయి. వాటిల్లో రూ.81లక్షల నగదు పోగా రూ.9.63లక్షలు రికవరీ అయ్యింది. ఈ ఏడాదికి వచ్చే సరికి 135 కేసులే నమోదైనా పోయిన నగదు విలువ రూ.4.99 కోట్లు ఉండడం గమనార్హం. రికవరీ రూ.85లక్షలుగా ఉంది.

### ఆందోళనకరంగా రోడ్డు ప్రమాదాలు




2023లో రోడ్డు ప్రమాదాలు 813 జరగ్గా 399 మంది మృతిచెందారు. 829 మంది గాయపడ్డారు. ప్రస్తుత ఏడాదిలో ప్రమాదాల సంఖ్య 863కు పెరిగింది. మృతుల సంఖ్య 373, క్షతగాత్రుల సంఖ్య 756గా నమోదైంది. మోటార్ వాహనాలకు సంబంధించి పోలీసులు ఈ ఏడాదిలో 1,54,934 కేసులు నమోదు చేసి, రూ.4.87కోట్ల ఫెనాల్టీని విధించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసుల సంఖ్య 9,840కి చేరింది. 65 కేసుల్లో జైలు శిక్ష పడగా, అందులో 11 జీవిత ఖైదీ శిక్షలు ఉన్నాయి. లోక్‌అదాలత్‌లో 23,204 కేసుల్లో పోలీసుల చొరవతో రాజీ జరిగింది.

### ప్రధాన కేసులు...

- కట్టంగూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసు ఆధారంగా భయంకరమైన ముగ్గురు పార్థీ గ్యాంగ్ సభ్యుల అరెస్ట్
- డమ్మీ పిస్టల్‌తో బైక్ దొంగతనాలకు పాల్పడే ఐదుగురు సభ్యుల అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు. రూ.90లక్షల విలువైన వాహనాల రికవరీ
- యాదాద్రి థర్మల్ ప్లాంట్ నుంచి అల్యూమినియం షీట్ల దొంగతనం కేసులో ఐదుగురి అరెస్టు. రూ.1.49కోట్ల సొత్తు రికవరీ
- దామరచర్లలో కాపర్ వైర్ చోరీ చేసే 8మంది అరెస్టు. రూ.26లక్షల నగదు స్వాధీనం
- మిర్యాలగూడ చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలో రూ.5.73కోట్ల విలువైన బంగారం స్వాధీనం
- గుడిపల్లి పీఎస్ పరిధిలో దేశవాళీ తుపాకులతో దోపిడీకి పాల్పడుతున్న నలుగురి సభ్యుల ముఠా అరెస్టు
- 34 గంజాయి కేసుల్లో 124 మంది అరెస్టు. రూ.1.98కోట్ల విలువైన 794 కేజీల గంజాయి సీజ్

## నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

● రెండు ఎన్నికలతో పెరిగిన క్రైమ్ రేట్
● జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్



నల్లగొండ ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

నీలగిరి, డిసెంబర్ 28 : నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో నల్లగొండజిల్లాలో నేరాల సంఖ్య తగ్గిందని, కానీ రెండు ఎన్నికల నిర్వహణ కారణంగా క్రైమ్ రేట్ పెరిగిందని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో 2024 వార్షిక నేర నివేదికను విడుదల చేసి మాట్లాడారు. జిల్లాలో గత సంవత్సరంతో పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ కారణంగా కేసుల సంఖ్య పెరిగిందన్నారు. మహిళలపై నేరాలను తగ్గించామన్నారు. చెడుదారి పడుతున్న యువతను సన్మార్గంలోకి తీసుకువచ్చేందుకు మిషన్ పరివర్తన్ తీసుకొచ్చినట్లు చెప్పారు. గంజాయి నియంత్రణపై దృష్టి సారించామని, దొంతనాల నివారణకు ప్రత్యేక చొరవ తీసుకుని గస్తీ పెంచామని తెలిపారు. అక్రమ దందాలపై ఉక్కుపాదం మోపినట్లు పేర్కొన్నారు. సైబర్ క్రైమ్‌లపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా గతేడాదితో పోల్చితే సగానికిపైగా కేసులు తగ్గించగలిగామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి తనతోపాటు డీఎస్పీ స్థాయి అధికారులు మండలాలను దత్తత తీసుకుని కృషి చేశామన్నారు. రెండు ఎన్నికల సందర్భంగా 308 కేసుల్లో 5 కోట్ల నగదు పట్టుకున్నట్లు తెలిపారు. ప్రమాదకరంగా మారిన పార్థీ గ్యాంగ్ ముఠాను జిల్లా పోలీసులు ప్రాణాలకు తెగించి అరెస్టు చేశారని చెప్పారు. జిల్లాలో 3,614 మంది తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకోగా ఇప్పటివరకు 1,473 రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. సమావేశంలో ఏఎస్పీ రాములు నాయక్, డీఎస్పీలు శివరాంరెడ్డి, లక్ష్మీనారాయణ ఉన్నారు.

## దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలక భూమిక

- టీఎస్‌యూటీఎఫ్ మహాసభల్లో వక్తలు
- అక్షరాస్యత పెంపునకు టీచర్లు కృషి చేయాలి : మండలి చైర్మన్ గుత్తా
- ప్రభుత్వ విద్యకు బడ్జెట్ పెంచాలి : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి
- ఉపాధ్యాయులు వేసే పునాదులతో సమాజాభివృద్ధి : ఎమ్మెల్సీ కోటిరెడ్డి
- ఇన్‌చార్జీల పాలనలోని విద్యా వ్యవస్థను సరిదిద్దాలి : టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య
- నల్లగొండలో అట్టహాసంగా రాష్ట్ర మహాసభలు ప్రారంభం

రామగిరి, డిసెంబర్ 28 : దేశ భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలక భూమిక అని పలువురు వక్తలు స్పష్టం చేశారు. రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర 6వ విద్య, వైజ్ఞానిక మహాసభల వేదికపై ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు. టీఎస్ యూటీఎఫ్ మహాసభలు నల్లగొండ పట్టణం లో శనివారం అట్టహాసంగా మొదలయ్యాయి. ముందుగా క్లాక్‌టవర్ సెంటర్‌లో వేలాది మంది టీచర్లతో మహా ప్రదర్శనను మహాసభల చైర్మన్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రారంభించగా, లక్ష్మీగార్డెన్స్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం అమర జీవి షేక్ మహబూబ్ అలీ ప్రాంగణంలో జాతీయ జెండా, ఎస్‌టీఎఫ్ఐ, టీఎస్‌యూటీఎఫ్ పతాకాలను యూటీఎఫ్ నాయకులు ఆంజనేయులు, విద్యాసాగర్‌రెడ్డి, బంగారయ్య ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యా వ్యవస్థను ముందుకు తీసుకెళ్లడంతోపాటు రాష్ట్రాల అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక కారణాలతో డ్రాపవుట్స్ పెరుగుతున్నాయని పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో 66 శాతం అక్షరాస్యత ఉన్నదని, దానిని 100 శాతానికి పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ మత విశ్వాసాలను, మూఢనమ్మకాలను పెంచి పోషించే విద్యా విధానం ప్రమాదకరమని ఆందోళన వ్యక్తంచేశారు. విద్య కాషాయీకరణ సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంతో పేద విద్యార్థులు చదువు దూరమయ్యే ప్రమాదం నెలకొందన్నారు. కార్పొరేట్ శక్తులతో విద్య వ్యాపార వస్తువుగా మారిందని పేర్కొంటూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు బడ్జెట్‌ను పెంచాలని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ అంతా ఇన్‌చార్జీల పాలనలో సాగుతుందని, ప్రభుత్వ ప్రత్యేక దృష్టి సారించాలని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మాట్లాడుతూ వ్యక్తి అభ్యున్నతికి, సమాజ వికాసానికి విద్య అవసరమన్నారు. ఉపాధ్యాయులు వేసే పునాదుల ద్వారానే సమాజ అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్లే విద్యా ప్రమాణాలు తగ్గుతున్నాయని విమర్శించారు. విద్యా రంగానికి అతి తక్కువ బడ్జెట్ కేటాయించడం దేశాభివృద్ధికి ఆటంకమన్నారు. తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ 206 సంఘాలతో జేఏసీ ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తున్నామన్నారు. రెండో పీఆర్‌సీ, డీఏలు, ఈహెచ్ఎస్‌ను వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌టీఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షురాలు మోతుకూరి సంయుక్త మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సీపీఎస్‌కు వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తున్నామన్నారు. అందరికీ నాణ్యమైన, సమానమైన విద్యా విధానం కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, ఏపీ యూటీఎఫ్ అధ్యక్షుడు నక్క వెంకటేశ్వర్లు, టాప్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ రాములు, కోశాధికారి లక్ష్మారెడ్డి, కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి, జి.నాగమణి, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశ్వర్లు, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బక్కా శ్రీనివాసాచారి, ఆడిట్ కమిటీ కార్యదర్శి యాకయ్య, జిల్లా కోశాధికారి నర్రా శేఖర్‌రెడ్డి, నల్లపరాజు వెంకన్న, సాంస్కృతిక కమిటీ కన్వీనర్ నల్లా నర్సింహ, జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల సైదులు పాల్గొన్నారు. మహాసభల సందర్భంగా మధ్యాహ్నం జరిగిన విద్యా సదస్సులో 'భారత ఆర్థిక వ్యవస్థలో మధ్య తరగతి ప్రజలకు ఏం జరుగుతోంది' అంశంపై మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌రావు ప్రసంగించారు. దేశంలో పాలకులు అవలంబిస్తున్న అసంబద్ధమైన విధానాల వల్లే సమాజంలో అంతరాలు పెరుగుతున్నాయన్నారు. సమాజాన్ని మార్చే శక్తి ఉపాధ్యాయులకు మాత్రమే ఉందని, అంకిత భావంతో పని చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని సూచించారు. జేఎన్‌యూ మాజీ అధ్యక్షురాలు, ఎస్ఎఫ్ఐ జాయింట్ సెక్రెటరీ అయిషీ ఘోష్ 'జాతీయ విద్యా విధానం – ప్రభుత్వ విద్యపై ప్రభావం' అంశంపై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యా రంగం నుంచి తప్పుకోవడానికే ప్రైవేట్ విద్యా రంగాన్ని ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. ఎన్ఈపీ–2020 ద్వారా రాష్ట్రాల విద్యా వ్యవస్థలను కేంద్రం నిర్వీర్యం చేస్తున్నదన్నారు. 'విద్యలో రాజ్యాంగ విలువలు' అంశంపై సీనియర్ జర్నలిస్ట్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో రాజ్యాంగ చిత్తశుద్ధి లేదన్నారు. ప్రభుత్వ బడుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీల పిల్లలే చదువుతున్నారని, ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించేందుకు చొరవ చూపాలన్నారు. రాత్రి సాంస్కృతిక ప్రదర్శనలో సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ పాట, మాటలతో అలరించారు.



టీఎస్ యూటీఎఫ్ మహా సభల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి, వేదికపై శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి, ఆ సంఘం నాయకులు

## ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో బాలింత మృతి

● దవాఖాన ఎదుట బంధువుల ఆందోళన


నల్లగొండ మాతా శిశు ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న రాజేశ్వరి బంధువులు

నీలగిరి, డిసెంబర్ 28 : నల్లగొండ జనరల్ ఆసుపత్రిలో బాలింత మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యమే మరణానికి కారణమంటూ ఆమె బంధువులు శనివారం దవాఖాన ఎదుట ఆందోళన చేశారు. దామరచర్ల మండలం జైలోతుతండాకు చెందిన రాజేశ్వరి (19) ప్రసవం కోసం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా.. పరీక్షించిన అక్కడి వైద్యులు హైరిస్క్ కేసుగా గుర్తించి నల్లగొండ జిల్లా జనరల్ దవాఖానకు రెఫర్ చేశారు. రెండు రోజుల క్రితం నల్లగొండలోని జనరల్ ఆసుపత్రికి వచ్చిన ఆమెకు వైద్యులు శుక్రవారం ఆపరేషన్ చేయగా.. మగ శిశువు పుట్టాడు. కాగా, రాజేశ్వరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. కానీ.. అక్కడికి వెళ్లే స్తోమత లేదని, ఇక్కడే చికిత్స అందించాలని ఆమె కుటుంబ సభ్యులు కోరారు. దాంతో వైద్యులు చికిత్స చేస్తుండగా రాజేశ్వరికి బీపీ విపరీతంగా పెరిగింది. ఎంత ప్రయత్నం చేసినా కంట్రోల్ కాకపోవడంతో చనిపోయింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే రాజేశ్వరి మృతిచెందిందని ఆమె బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. పోలీసులు వచ్చి వారికి నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

## కదం తొక్కిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

● సూర్యాపేటలో భారీ ర్యాలీ
● నల్లగొండలో గాంధీ టోపీలు ధరించి మౌన దీక్ష



సూర్యాపేటలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సూర్యాపేట టౌన్/ రామగిరి, డిసెంబర్ 28 : తమ సమస్యలను పరిష్కరించి రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ 18 రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు శనివారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. నల్లగొండ కలెక్టరేట్ వద్ద గాంధీ టోపీలు పెట్టుకొని మౌన దీక్ష చేపట్టారు. అనంతరం నల్లగొండకు వచ్చిన శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రధాన వీధుల గుండా శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట, నల్లగొండ జిల్లాల అధ్యక్షులు రాంపంగు వెంకటేశ్వర్లు, మొలుగురి కృష్ణ మాట్లాడుతూ ఎన్నికల ముందు హనుమకొండలో జరిగిన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టీ తాగే లోపు సమస్యలు పరిష్కరిస్తానని చెప్పి నేటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వంద రోజుల్లో ప్రజాభవన్‌కు పిలిచి జీఓ జారీ చేస్తానని చెప్పి సంవత్సరం గడుస్తున్నా స్పందన లేదని విమర్శించారు. తాము రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తున్నా పట్టించుకునే నాథుడు లేడని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, లేకుంటే పే స్కేల్ అయినా ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమాల్లో సంఘం రాష్ట్ర కార్యదర్శులు గడ్డం శ్రీనివాస్, కంచర్ల మహేందర్, సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, ఉపాధ్యక్షుడు రాంబాబు, కోశాధికారి లక్ష్మీనారాయణ, నాయకులు సయ్యద్, తేజస్వీ, సఫియా, వసంత, సరస్వతి, శ్రీను, రవీందర్, ఫయాజ్, జమాల్, సైదయ్య పాల్గొన్నారు.


నల్లగొండలో గాంధీ టోపి పెట్టుకొని మౌన దీక్ష చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

